వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 132

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: బుధవారం 03 జూన్ 2026





తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహణ



## అమిత్‌షాను కలిసిన అన్నామలై..

**సమయం ప్రతినిధి:** తమిళనాడు మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంగళవారంనాడిక్కడ కలిశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఆర్గనైజేషన్ సెక్రటరీ బీఎల్ సంతోష్‌లతో తొలుత సమావేశమైన అన్నామలై తన రాజీనామా పత్రాన్ని వారికి సమర్పించారు. ఆ వెంటనే అమిత్‌షాను కూడా కలుసుకోవడంతో ఆయన కొత్త పార్టీని స్థాపించేందుకు నిశ్చయించుకున్నారనే ఊహాగానాలు మరింత ఊపందుకుంటున్నాయి. అయితే కొత్త పార్టీ ఆలోచనను అన్నామలై ఇంతవరకూ అధికారికంగా ఇంకా ధ్రువీకరించలేదు. న్యూఢిల్లీ పర్యటనలో అన్నామలైను పార్టీలోనే కొనసాగాలని బీజేపీ అధిష్ఠానం కోరిందని, రాజ్యసభ సీటు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని, దీనిపై ఒక నిర్ణయానికి వచ్చేంతవరకూ ఢిల్లీలోనే ఉండాలని సూచించిందని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అన్నామలై సైతం తన నిర్ణయాన్ని రెండ్రోజుల్లో తెలియజేస్తానని ఢిల్లీకి బయలుదేరే ముందు చెన్నైలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. ఖైదీలు ఇవాళ జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి ఇవాళే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.




**సమయం ప్రతినిధి:** తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కళ్యాణ్.. ఇది మా అయ్యా జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటీ? అని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటి? అని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో అమరవీరులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఆపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల పాలైందని వ్యాఖ్యానించారు. లివింగ్ లెజెండ్ కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ వచ్చాక నోరుందని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'ఎత్తిన జెండా దించనని.. జెండా దించితే రాళ్లతో కొట్టిచంపమని అన్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్' అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. నెత్తురు పారిన చోట సాగు నీళ్లు తీసుకువచ్చింది కేసీఆర్ అని తెలిపారు. లక్షా 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని.. అల్పకులు ఏది పడితే అది మాట్లాడతారని మండిపడ్డారు. దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుందన్నారు. తెలంగాణను కాంగ్రెస్.. కుక్కలు చింపిన విస్తరిలా చేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులు.. అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, గోదావరిని గురువుకు గురుదక్షిణగా రేవంత్ ఇస్తున్నారని ఆరోపించారు. 'రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వచ్చి చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బయటికి వస్తారా.? రైతుబంధు లేదు.. కానీ రాహుల్ గాంధీ బంధు టింగ్ టింగ్ అని వెళ్తోంది. తెలంగాణ తల్లి ఒడ్డాణం, కిరీటం ఎత్తుకుపోతున్నారు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి: మంత్రులు ఉత్తమ్, జూపల్లి

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా పర్యటన మార్గం, భద్రతా చర్యలు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సాగునీటి ప్రాజెక్టుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సవివరంగా చర్చించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సాగునీటి రంగ అభివృద్ధి ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని కీలక సాగునీటి ప్రాజెక్టులను సందర్శించి వాటి పురోగతిని పరిశీలించనున్నారని తెలిపారు. ప్రాజెక్టుల ప్రాధాన్యత, కొత్తగా సాగులోకి వచ్చిన ఆయకట్టు, రైతులకు కలిగే ప్రయోజనాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పర్యటనలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, రవాణా, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని




మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలతో పాటు ప్రాజెక్టుల సందర్శనకు సంబంధించిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని, జిల్లాల వారీగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలని అన్నారు. భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను ముఖ్యమంత్రి సందర్శించనున్నారని, అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ మంత్రులకు వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ డి. జానకి, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# సంపాదకీయం

## వలసలకు మతం ఎక్కడిది?

ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఇప్పుడు ఒక నినాదం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రధానపార్టీల్లో కొన్ని ఆ నినాదం చుట్టూనే రాజకీయాలను నడుపుతున్నాయి. ప్రజల్లో ఉద్వేగాలనూ శత్రుత్వ భావనలనూ రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన జనాకర్షక నాయకులందరూ ఆ నినాదమంత్రాన్నే జపించారు. అధికార పీఠాన్ని అందుకోటానికి తహతహలాడుతున్న నేతలూ అదే అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. అక్రమ వలసదారులను దేశం నుంచి తరిమికొడతామన్నదే ఆ నినాదం. వ్యక్తీకరణలో ఎన్ని తేడాలైనా ఉండొచ్చు.. కానీ సారాంశంలో మాత్రం వలసదారుల లక్ష్యంగానే రాజకీయ ప్రచారం ఊపందుకుంటోంది. దీనికి ఏ ప్రజాస్వామ్యదేశమూ మినహాయింపు కాదు. అన్ని ప్రజాస్వామ్యదేశాలకూ బయట నుంచి వచ్చే వలసల సమస్య తీవ్రమవుతూ ఉంది. దీన్ని కాదనలేం. ఉద్యోగాలు, ఉపాధికోసం వచ్చే సక్రమ వలసలను బాగా తగ్గించాలనే డిమాండు ఒకవైపు ఉంటే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాలనే లక్ష్యం కొన్నిచోట్ల విపరీత పోకడలు పోతోంది. అమానవీయంగా తయారవుతోంది. ఇటీవల జరిగిన బెంగాల్, అసాం అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమ వలసల సమస్యే బీజేపీకీ ప్రధాన ప్రచార ఆయుధంగా మారింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వస్తోన్న ముస్లింలతో బెంగాల్, అసాంల్లో జనాభా ముఖచిత్రం మారిపోతోందన్న ప్రచారానికే అది పరిమితం అవ్వలేదు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోకీ అక్రమ వలసదారులు చొచ్చుకుపోతున్నారనీ అనేకచోట్ల స్థానికుల ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారనీ ఆరోపించింది. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతోందనీ సాక్షాత్తూ కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోటానికి మే 26న ఒక ఉన్నత స్థాయి కమిటీని (హైలెవల్ కమిటీ ఆన్ డెమొగ్రాఫిక్ చేంజ్) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఒక సంవత్సరంలోపు నివేదికను ఇవ్వాలని ఆ కమిటీకి నిర్దేశించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ప్రకాశ్ ప్రభాకర్ నావ్లేకర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఆ కమిటీలో మరో నలుగురు సభ్యులు ఉన్నారు. అందులో భారత జనగణన కమిషనర్ కూడా ఒకరు. విచిత్రం ఏమిటంటే కమిటీ చైర్మన్‌కు జనాభాలో వచ్చే అనేక రకాల మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేసే డెమొగ్రఫీ వ్యవహారంతో అంతకుముందు పెద్దగా పరిచయం లేదు. మధ్యప్రదేశ్‌లో విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న తనను ఉన్నతస్థాయి కమిటీకి చైర్మన్‌గా ప్రకటించటం ఆశ్చర్యం కలిగించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు 'ద హిందూ' పత్రిక పేర్కొంది. కమిటీలో ఉన్న మిగతా ముగ్గురు కూడా (జనగణన కమిషనర్ మినహా) జనాభా అధ్యయన శాస్త్రంలో జాతీయస్థాయిలోనూ అంత పేరు ప్రఖ్యాతులు ఉన్నవారేమీ కాదు. పొట్టచేతపట్టుకుని సరిహద్దులను దాటుకుని వచ్చి కూలీనాలీ చేసుకోవటం ఈనాటి సమస్య కాదు. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ ఉంది. ఉమ్మడి బెంగాల్ రాష్ట్రం నుంచి అసాంలోకి ముస్లింల వలసలను బ్రిటిష్ పాలకులు బాగా ప్రోత్సహించారు. అంతకుముందు అసాం రాజులూ ఆ పనిని చేశారు. ఇక స్వాతంత్ర్యానంతరం తూర్పుబెంగాల్‌లో ఆర్థిక పరిస్థితులు అస్తవ్యస్తం అయినప్పుడల్లా ఉపాధికోసం భారత భూభాగంలోకి ప్రజలు వలసలు రావటం సర్వసాధారణంగా మారింది. ఆ వలసలు బంగ్లాదేశ్ యుద్ధమప్పుడు ఇంకా ఉధృతం అయ్యాయి. ఆ తర్వాతా కొనసాగాయి. వలసలూ ఇతర కారణాలతో క్రమేపీ ముస్లిం జనాభా పెరగటం అసాం మధ్యతరగతిలో తీవ్ర అభద్రతా భావాన్ని సృష్టించింది. అసాం విద్యార్థుల సంఘం నేతృత్వంలో బెంగాలీయులకు వ్యతిరేకంగా అక్కడ ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమం ఎన్నో ఆటుపోట్లకు లోనైనా చివరకు వలసప్రజల విషయంలో ఒక ఒప్పందానికి దారితీసింది. 1985 ఆగస్టు 15న కుదిరిన ఆ ఒప్పందం ప్రకారం... 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలోకి ప్రవేశించిన వారందరినీ అక్రమ వలసదారులుగా ప్రకటించి ఓటర్ల జాబితా నుంచి వాళ్ల పేర్లను తొలగించాలి. ఒప్పందం కుదిరి 40 ఏళ్లు గడిచిపోయింది. ఇప్పటికీ ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి నాటికి అసాంలో అర్హులైన పౌరులనూ వారి వారసులనూ గుర్తించి నేషనల్ రిజిస్ట్రేషన్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) నవీకరించటం 2019లోనే పూర్తయినా దాన్ని ఇంకా నోటిఫై చేయలేదు. ఎన్నో వివాదాలు, అభ్యంతరాలతో ట్రైబ్యునళ్లు, కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. అక్రమ వలసదారులందరూ ముస్లింలేనని విపరీతంగా ప్రచారం జరిగినా ఎన్‌ఆర్‌సీ కసరత్తులో అది నిజం కాదని తేలింది. ఎన్‌ఆర్‌సీలో చోటుదక్కని ప్రజల సంఖ్య 19.06 లక్షలని నిర్ధారించారు. దాని ప్రకారం అక్రమ వలసదారులు అసాంలో అంతమంది మాత్రమే ఉన్నట్లు లెక్క. మిగతా 3.11 కోట్ల మంది అసాం స్థానికులే. 1,600 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చేసిన కసరత్తులో తేలిన నిజం అదే. అక్రమ వలసదారుల్లో ఏ మతం వారు ఎంతమంది ఉన్నారో ఎన్‌ఆర్‌సీ తుదిజాబితాలో అధికారికంగా పేర్కొనలేదు. అనధికారిక అంచనాల ప్రకారం హిందువులే ఆ జాబితాలో ఎక్కువగా ఉన్నారు. బంగ్లాదేశ్ నుంచి హిందువులు వలసలు రావటం ఎప్పుడూ ఉంది. అన్ని పత్రాలూ పుచ్చుకుని వలసలు వచ్చే పరిస్థితి భారత ఉపఖండంలోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా లేదు. అక్రమ వలసదారుల్లో హిందువులు ఎక్కువగా ఉండటానికి ప్రధానకారణం బంగ్లాదేశ్‌లో వారి సంఖ్య గతంలోనూ ఇప్పటికీ అధికంగానే ఉంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 1.3 కోట్ల మంది హిందువులు బంగ్లాదేశ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్ జనాభాలో హిందువుల శాతంలో తగ్గుదల ఉన్నా సంఖ్యాపరంగా చూస్తే పెరుగుదలే కనిపిస్తుంది. 1951లో 92 లక్షల హిందూ జనాభా ఉంటే, ఇప్పుడది 1.3 కోట్లు అయింది. అసాం ఒప్పందం ప్రకారం అక్రమ వలసదారులను మతపరంగా విభజించి చూడటానికి వీల్లేదు. 1971 మార్చి 24 అర్ధరాత్రి తర్వాత దేశంలో కాలుపెట్టిన వాళ్లందరినీ అక్రమ వలసదారులుగానే భావించాలి. హిందువులకూ ముస్లింలకూ ఇదే సూత్రాన్ని వర్తింపచేయాలి. ఎన్‌ఆర్‌సీ ప్రకారం అక్రమ వలసదారుల్లో హిందువులు అధికంగా ఉన్నట్లు స్పష్టంగా తేలటంతో కేంద్ర ప్రభుత్వం అసాం ఒప్పందానికి విరుద్ధంగా అడుగులు వేసింది. ముస్లింలను పక్కనబెట్టి హిందువులకూ మరో అయిదు మతవర్గాల వారికి మాత్రమే పౌరసత్వం కల్పించటానికి పౌరసత్వ చట్టానికి సవరణను తీసుకువచ్చింది.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు విజయవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాల నిర్వహణతో పాటు గ్రామసభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యక్ష ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. రైతాంగం స్థిరమైన వ్యవసాయం కోసం పంటల మార్పిడి దిశగా అడుగులు వేయాల్సిన అవసరంపై అవగాహన కల్పించాలని, వర్షాకాల సన్నద్ధత, విస్తృత స్థాయిలో మొక్కల నాటకం, ఘన వ్యర్థాల నిర్వహణ ద్వారా పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జూన్ 4, 6, 8, 10 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా గ్రామసభలు, మున్సిపాలిటీల పరిధిలో వార్డు సభలు సమన్వయంతో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణకు ముందస్తు షెడ్యూల్ రూపొందించి అన్ని గ్రామాల్లో సమావేశాలు జరిగేలా చూడాలని డీపీఓ, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. గ్రామసభల్లో రైతులకు పంటల మార్పిడి, ఆయిల్ పామ్ సాగు, ఉద్యానవన పంటలు, ఫార్మర్ రిజిస్ట్రీ, నానో యూరియా వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంతల ప్రాధాన్యత, మొక్కల పెంపకం, వర్షాకాల సన్నద్ధతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్పీ సీఈఓ ఇన్‌చార్జి, డీపీఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి. వెంకటేష్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే



**(సమయం ప్రతినిధి గద్వాల) :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా జాతీయ జెండా ఎగరవేశారు , ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగినది.లి ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రజలందరికీ 12వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది ముఖ్యంగా రాష్ట్రంలో వారి అత్యధికంగా వరి పంటను అలాగే రిజర్వాయర్లు కూడా అభివృద్ధి చెందడం జరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మేలు చేసే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతుందని తెలిపారు అదేవిధంగా భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూటిగా ఎదగాలి అన్ని రాష్ట్రాల్లో కన్నా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి నిలవాలని ఆకాంక్షించారు. ఏ ప్రభుత్వాలు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కొరకు, ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు కొరకు నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టెస్ట్.. గిస్ట్... జాన్తా నై... పైసలు ఉంటే లైసెన్స్

హైదరాబాద్ : రవాణా శాఖ సేవలను డిజిటలైజ్ చేస్తూ, పౌరులకు దళారుల వేధింపులు లేకుండా సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'వాహన్ పోర్టల్'ను అమల్లోకి తెచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉన్నప్పటికీ, ఆర్టీఓ కార్యాలయాల్లో దళారుల హవా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ అధికారులు నగర శివార్లలోని మేడ్చల్, పేట్‌బషీరాబాద్, కొండాపూర్ రవాణా కార్యాలయాల్లో ఏకకాలంలో జరిపిన ఆకస్మిక సోదాల్లో ఈ దందా బహిర్గతమైంది. ఈ తనిఖీల్లో భాగంగా ఆర్టీఓ కార్యాలయాల ఆవరణలో తిష్టవేసిన పలువురు మధ్యవర్తులను, ప్రైవేటు వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. సౌకర్యవంతమైన ఆన్‌లైన్ వ్యవస్థ ఉన్నప్పటికీ, సాధారణ వాహనదారులకు మాత్రం ఏజెంట్ల వేధింపులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, అన్ని సరైన పత్రాలతో నేరుగా వెళ్లే పౌరులకు ఏదో ఒక సాకుతో తిరస్కరిస్తూ వెనక్కి పంపుతున్నారు. అదే సమయంలో, ఒక ఏజెంట్‌ను ఆశ్రయిస్తే ఎలాంటి నిబంధనలు లేదా పరీక్షలు లేకుండానే పనులు సులువుగా పూర్తవుతున్నాయి. లెర్నింగ్ లైసెన్స్, పర్మనెంట్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల వంటి ప్రతి పనికీ దళారులు సొంతంగా ఒక ధరను నిర్ణయించి సామాన్యుల నుండి భారీగా వసూలు చేస్తున్నారు. ఏజెంట్లను సంప్రదించకుండా, వారు అడిగినంత ఇచ్చుకోకుండా చిన్న పని కూడా కావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది.

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీ పాలన : ప్రభుత్వ విప్ యెన్నం



**(సమయం ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రభుత్వ విప్ కి ఘనంగా స్వాగతం పలికారు, ఈ సందర్భంగా ఆయన పోలీసుల చేత గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను సాకారం చేసుకుని తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలి సారధ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన ప్రజాపాలనను అందిస్తూ, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుక సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతూ, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాల సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు మరియు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే శ్రీ గండ్రా సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# అమరుల ఆశయ సాధనకు అంకితం కావాలి : మంత్రి శ్రీహరి పిలుపు

**(సమయం ప్రతినిధి మక్తల్):** మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్ రోడ్ వద్ద రాష్ట్ర క్రీడ,పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక,మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. చౌరస్తా వద్ద తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర సాధనలో 1200 మంది పైగా అమరులయ్యారన్నారు. తెలంగాణ పునరనిర్మాణంలో మనమందరం పునరశీకితం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారి ఆశయ సాధనకు కృషి చేయాలని మంత్రి వెల్లడించారు. మక్తల్ అభివృద్ధి కి అన్ని రాజకీయ పార్టీ లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మక్తల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం మానుకోవాలని ప్రతి పక్షాలకు హితవు పలికారు. ఏదైనా కూల్చడం సులువు కానీ నిర్మించడం చాలా కష్టమని విపక్షాలకు చురకలంటించారు. పార్టీలకతీతంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనడం సంతోషదాయకమన్నారు. నారాయణపేట చౌరస్తా వద్ద






ఏర్పాటు చేసిన మానవహారంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు మక్తల్ మున్సిపల్ ఛైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం : మాజీ మంత్రి

**(సమయం ప్రతినిధి వనపర్తి):** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయములో గౌరవ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలంగాణ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నాయకులతో కలిసి ఘనంగా నివాళు లు అర్పించి జాతీయ పతాకం మరియు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తన 16వ ఏటనే తెలంగాణ ప్రాధాన్యత వివరిస్తూ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మకద్రోహ పార్టీగా మొదటి నుండి రామ్ మనోహర్ లోహియా,జయప్రకాష్ నారాయణ, ఎన్. టి.ఆర్ పునరుద్ఘాటించారు అని వారి మార్గదర్శనములో కె.సి.ఆర్ తన శ్వాస, ధ్యాస తెలంగాణ రాష్ట్ర సాధనగా ఉద్యమం 14ఏండ్లు అహింసహితంగా ఉద్యమం చేపట్టి రాష్ట్రాన్ని సాధించి ప్రజలలో నెలకొన్న నిరాశ, నిస్పృహలు దూరం చేసిన మాహా నాయకుడు కె. సి.ఆర్ అని కొనియాడారు. జయశంకర్ ఓడవని ముచ్చట పుస్తకం కె.సి.ఆర్ స్ఫూర్తిగా తీసుకొని రాష్టాన్ని సాధించి 9ఏండ్లు సుపరిపాలన అందించారని అన్నారు.

రెండేండ్లలో ప్రజల తిరస్కారానికి గురైన కాంగ్రెస్. కె.సి.ఆర్ 9ఏండ్ల సుపరిపాలన చూసిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విధ్వంస పాలన చూసి విసిగి పోయారని ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు రైతు భరోసా రైతు బీమా,రైతు రుణ మాఫీ చేయకుండా యూరియా సకాలంలో పంపిణీ చేయకుండా,కరెంట్ కోతలతో సతాయించినా పంటలు పండించిన పంటలు కొనుగోలు చేయకుండా రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ పార్టీ ఆగం కాక తప్పదు అని అంతేకాకుండా మహిళలకు 2500,తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు స్కూటీలు, కె.సి.ఆర్ కిట్టు,గ్యాస్ సబ్సిడీ,దళిత బంధు,బి.సి.బంధు వంటి పథకాలకు మంగళం పాడారని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు మళ్ళీ కె.సి.ఆర్ రావాలని కోరుకుంటున్నారని జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని కె.సి.ఆర్ అడుగుజాడలలో నడుస్తూ తెలంగాణ అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మక్తల్ సస్యశ్యామలమే నా ధ్యేయం: మంత్రి వాకిటి





**(సమయం ప్రతినిధి మక్తల్) :** మక్తల్ నియోజకవర్గాన్ని సస్య శ్యామలం చేయడమే తన ధ్యేయమని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు . మక్తల్ లో ఈ నెల 4 వ తారీఖున ముఖ్యమంత్రి పర్యటన పై మంత్రి క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ నాయకులు, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నారాయణపేట జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని తెలిపారు. జూన్ 4 వ తేదీన మక్తల్ ప్రాంతం లో సాగునీటి ప్రాజెక్టులపై సీఎం ఏరియల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు.కృష్ణా నది పై కొల్పూర్–కొర్తికొండ వద్ద 1.8 టీఎంసీ, మురారి దొడ్డి – గంజి పల్లి,దేవసూగురు వద్ద బ్రిడ్జి కం బారేజ్ లకు అదేవిధంగా భీమా నది పై సుకుర్ లింగం పల్లి, కుసుముర్తి వద్ద బ్రిడ్జి కం బారేజ్ లకు కూడా ముఖ్య మంత్రి ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ల్లో బ్యారేజీలు నిర్మించడం ద్వారా జిల్లాకు సాగు, తాగు నీటి సమస్య తీర్చవచ్చని తెలిపారు.ప్రాజెక్టు పరిధిలో 51 శాతం భూభాగం తెలంగాణకు, 49 శాతం కర్ణాటకకు ఉండటంతో రెండు రాష్ట్రాలకు సమాన ప్రయోజనం కలిగే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర ప్రతినిధులతో కలిసి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కీలక సాగునీటి ప్రాజెక్ట్ లపై సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.5 వేల కోట్లతో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని అన్నారు.

నర్వ మండలంలోని జంగంరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం 175 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 13 గ్రామాల్లోని సుమారు 7,500 ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. సీఎం ఏరియల్ సర్వే సందర్భంగా ఆయా పరిధిలో ఉన్న మండలాల్లోని రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జెండాలు చేతబట్టి ముఖ్యమంత్రిని స్వాగతిస్తూ పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది...

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ పెరుగుతున్న తరుణంలో, కీలక నేతల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు గ్రూపు రాజకీయాలను రోడ్డుకు ఈడుస్తోంది. ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు చేస్తున్న ప్రయత్నాలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుండటంతో, అటు కేడర్ తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు గురవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.బీజేపీలో గత కొంతకాలంగా సాగుతున్న పాత వర్సెస్ కొత్త నేతల వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టర్లు వేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ వర్గానికి చెందిన కొందరి హస్తం ఉందంటూ ఈటల అనుచరులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తిరోగమనంలో పయనిస్తోంది: మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, సమయం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జడ్చర్ల పట్టణంలో మంగళవారం జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాలను మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యాగం చేసి ఉద్యమంలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిందని, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపిందని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, రెండున్నర సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు రాష్ట్రానికి శాపంగా మారాయని, అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం, హమాలీల కొరత, లారీల సమస్యలు, మిల్లర్ల దోపిడీ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఇదే పోరాట స్ఫూర్తితో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు ప్రజల్లో ఉండాలని మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి టూరిజం ప్లాజా పనులను పరిశీలించిన మాజీ మంత్రి







(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో వెయ్యి పడకల సూపర్ స్పెషలిటీ అస్పత్రి.. టూరిజం ప్లాజాను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం నాడు కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొట్ట మొదటి మెడికల్ కాలేజీ ని మహబూబ్ నగర్ కి తీసుకువచ్చామని చెప్పారు.మెడికల్ కాలేజీ నిర్మాణం చేసుకున్నాం.. పాత అస్పత్రి భవనంలో కొత్త భవనాలు నిర్మాణం చేసి అక్కడ వసతులు మెరుగు పరిచాము. మహబూబ్ నగర్‌కు సూపర్ స్పెషలిటీ వైద్య సేవలు అవసరమని కెసిఆర్‌ని ఒప్పించి వెయ్యి పడకల అస్పత్రి తీసుకువచ్చాము. జిల్లాలోని పేద ప్రజలు కాన్సర్.. గుండె.. కాలేయ సమస్యల బారిన పడుతున్నట్లు గుర్తించి బస్టాండ్‌లో దిగిన వెంటనే వైద్యం అందె హాస్పిటల్ నిర్మాణం చేసాము. భవనం పూర్తి ఐ కలర్స్ వేసే వరకు పనులు మా హయాంలో పూర్తి చేసాము. ఎలక్షన్ సెల్ వల్ల ఒక విభాగం ఆలస్యం అయింది. రూ. 500 కోట్ల తో పరికరాలు కొనాల్సి ఉంది.. కానీ జూన్ 2 ప్రారంభం చేస్తారని ప్రజాప్రతినిధులు చెప్తే టెండర్లు పిలిచి వసతులు కల్పించి ప్రారంభిస్తారని అనుకున్న కానీ చేయలేదు. ఐదు ఆరు జిల్లాల ప్రజలకు ఇది ఉపయోగపడుతుంది. కాన్సర్.. గుండె పోటుతో జిల్లాకు చెందిన వాళ్ళు చనిపోతున్నారు. వెంటనే ప్రజలకు అందు బాటులోకి తీసుకురండి. రెండున్నర యేండ్ల నుంచి పనులు చేస్తారని వేచి చూసాము.. అధికారులు వెంటనే టెండర్ పిలిచి సూపర్ స్పెషలిటీ వైద్య సేవలు ప్రారంభించాలి. రిబ్బన్‌లు కట్ చేసి శిలాఫలకలు పెట్టకుండా భవనంలో పరికరాలు.. వసతులు కల్పించి సూపర్ స్పెషలిటీ వైద్య సేవలు ప్రజలకు అందించాలి. సోమశిల అభివృద్ధికి జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేస్తే నేను మంత్రి అయినా తరువాత సోమశిల ను అన్నీ హంగులతో అభివృద్ధి చేసాము.. ఇప్పుడు ముఖ్యమంత్రి అక్కడే బస చేస్తున్నారని తెలిసింది. సోమశిలతో పాటు ఈగలపెంట.. మన్ననూరు తో పాటు జోగులాంబ వద్ద టూరిజం శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసాము. హాస్పిటల్ పక్కన టూరిజం ప్లాజా పెడితే రోగులకు వసతి సౌకర్యం కల్పించవచ్చని అనుకున్నాం. వాటి పనులు నిలిపివేశారు. కన్వెన్షన్ సెంటర్ కూడా అందులో ఉంది. 2023 ఎ న్నికల అప్పుడు యెట్లా ఉందో అట్లనే ఇప్పుడు అట్లనే భవనం ఉంది. ఫైల్ తెప్పించి ఎందుకు పనులు చేయడం లేదో కాంట్రాక్టర్ పిలిచి మాట్లాడి పనులు ప్రారంభించి ప్రజలకు చెప్పాలి. మన్యంకొండ రోప్ వే పనులు నిలిపి వేశారు.. పనులు ప్రారంభం అయ్యాయి.. సాయిల్ టెస్ట్ అయింది..కానీ కాంట్రాక్టర్ వెళ్ళిపోయిండు.. పేదల తిరుపతిగా పెరుగంచిన మన్యంకొండ వద్ద రోప్ వే చేస్తే భక్తుల సంఖ్య పెరుగుతుంది. హరిత హోటల్ స్లాబ్స్ వేసినాము.. హరిత హోటల్ పరిస్థితి అట్లనే ఉంది..2023 ఎన్నికల టైంలో యెట్లా ఉండేనో ఇప్పుడు అట్లనే ఉంది. పేదలు ఉండేందుకు వసతి లేకుంటే 18 గదులు పూర్తి చేసి 100 గదుల నిర్మాణంకు శంకుస్థాపన చేసాము.. దేవుని మీద కనికరం చూపి పనులు పూర్తి చేయండి. నీళ్ల సమస్య రావద్దని రిసర్వాయర్ కట్టినాము. కులావృత్తుల కోసం శిల్పరామం నిర్మాణం చేస్తే దానిని మూసివేశారు చిల్డ్రన్స్ ఆమ్యూజియం పార్క్ పనులు కూడా నిలిపి వేశారు.ట్యాంక్ బండ్ లో నెక్లెస్ రోడ్డు.. ఉమెన్స్ పార్క్.. ఫుడ్ కోర్టు..సీనియర్ సిటిజెన్ ట్రాక్.. సైకిల్ ట్రాక్..చిల్డ్రన్స్ పార్క్. మ్యూజికల్ నైట్ ఏర్పాటుకు అవసరం అయినా వసతులు.. ఐలాండ్ వెళ్లేందుకు బ్రిడ్జి ఇవి పూర్తి చేస్తే ట్యాంక్ బండ్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.. లేకుంటే పాత ఇనుప సామాను కు అమ్ముకోవాలన్నారు.జూపల్లి మీ ప్రాంతంలో శిలాఫలకం వేస్తె అన్నీ పనులు పూర్తి చేసాము.. మీరు మా వద్ద టూరిజంకి సంబందించిన ఇన్ని పనులు ఆపవద్దు.. హాస్పిటల్ పూర్తి చేయాలి.. దయచేసి సమీక్షా చేసి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వెంట గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గాడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న,పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ కార్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కెసిఆర్ అన్ని వర్గాలను .. పార్టీలను ఐక్యం చేసి తెలంగాణ సాధించారన్నా రు.తెచ్చుకున్న తెలంగాణను కెసిఆర్ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసాము.కెసిఆర్ హయాంలో ఎక్కువ పంట పండించింది తెలంగాణ లోనే.. రైతులకు ఉచిత విద్యుత్ తెలంగాణ లోనే.

రైతు బందు.. ఇంటింటికి నీరు.. ప్రకృతి వనాలు ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసాము.అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.తెలంగాణ లో బులడోజర్ పాలన సాగుతుంది.. అక్రమ కేసులు పెడుతున్నారు.. తెలంగాణ నీటిపారుదుల శాఖ లో సలహాదారు ఆంధ్రప్రదేశ్ లో పనిచేసిన అధికారిని నియామకం చేసారు.. పాలమూరు ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి. తెలంగాణలో మళ్ళీ పూర్వ వైభవం రావాలంటే కెసిఆర్ ని మల్ల ముఖ్యమంత్రి చేసుకోవాలని.. దానికోసం ప్రతి నాయకుడు.. కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు.కార్యక్రమం లో గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గాడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న,పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## కొత్తూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



కొత్తూర్, సమయం ప్రతినిధి : ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ మంగళవారం కొత్తూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల దర్యాప్తు, నిరోధక చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్ కేసులు, వినతిపత్రాల పరిష్కారం, నేర గణాంకాలు, శాఖాపరమైన కార్యక్రమాల అమలుపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యం, పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రజలకు చేరువైన పోలీసింగ్ అందించాలని కమిషనర్ సూచించారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణ స్పందనతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను మెరుగుపరచాలని సూచించారు. గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీపీఓలు నిఘాను పెంచి అనుమానాస్పద కదలికలు, సంఘటనలపై వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమన్వయం పెంచి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు.రౌడీషీటర్లు, అలవాటు నేరస్తులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జూదం తదితర నేరాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. మహిళల భద్రత, బాలల సంరక్షణ, వృద్ధుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేరాల గుర్తింపు, దర్యాప్తులో ఆధునిక సాంకేతికత, డిజిటల్ సాధనాలను వినియోగించాలని పేర్కొన్న ఆయన, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యం, నైతిక విలువలను పాటించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, సామరస్య వాతావరణం, ప్రజా భద్రత కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ తరుణ్ జోషి, ప్రజల భద్రత, పోలీసులపై విశ్వాసం పెంపొందించడంలో అధికారులు, సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ శ్రీమతి శిరీష రాఘవేంద్ర, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ లక్ష్మీ నారాయణ, కొత్తూర్ సీఐ నర్సయ్య, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తిరోగమనంలో పయనిస్తోంది: ఆల వెంకటేశ్వర్ రెడ్డి



భూత్పూర్, సమయం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భూత్పూర్ మండల కేంద్రంలో మంగళవారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జెండాను మండల అధ్యక్షుడు బసవ రాజు గౌడ్ ఆవిష్కరించారు. పార్టీ ఆదేశాల మేరకు “తెలంగాణ వ్యతిరేకుల కుట్రలను చేధిద్దాం.. మన తెలంగాణను రక్షించుకుందాం” అనే నినాదంతో నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడవడం గర్వకారణమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలబెట్టిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు.వరి, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులు పంట పండించడమే కాకుండా అమ్ముకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందని చెప్పారు. మిల్లర్ల తరుగు దోపిడీని అరికట్టి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులకు ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## హరీష్ రావు పార్టీ మార్పు ప్రచారం

మెదక్ : తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ మార్పు అంశం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు, దానికి హరీష్ రావు అంతే ఘాటుగా ఇచ్చిన కౌంటర్లతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొన్ని రోజులుగా తెరవెనుక నడుస్తున్న ఈ ప్రచారం.. ఇప్పుడు ఇద్దరు అగ్ర నేతల మధ్య బహిరంగ సవాల్‌గా మారింది.ఇటీవల మీడియాతో నిర్వహించిన ఒక చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే క్లారిటీ లేదని, భవిష్యత్తులో ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదంటూ ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, గత చరిత్రను తవ్వుతూ 2008లో హరీష్ రావు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసింది నిజం కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. ప్రస్తుతం హరీష్ రావు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారో, ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు పూర్తి సమాచారం ఉందని సీఎం వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# మహనీయుల పోరాటాల త్యాగ ఫలితమే తెలంగాణ : జిల్లా ఎస్పీ







**అమరవీరుల ఆశయ సాధనకు**
**ప్రతి పోలీసు ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలి**
**ప్రజల భద్రతే పరమావధిగా సేవలందించాలని పోలీసు సిబ్బందికి పిలుపు**
**సేవా పతకాలు అందుకున్న పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్పీ**

**(సమయం ప్రతినిధి వనపర్తి) :** తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు మరియు మహనీయుల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర అత్యంత కీలకమైందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కర్తవ్య నిర్వహణలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు.:లి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, సాయుధ పోలీసుల వందనం స్వీకరించి ఉదయం 7:15 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతాలాపన చేసి జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 2014 జూన్ 2న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం నేటితో 12 సంవత్సరాల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదని, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ బాధ్యతను పోలీసు శాఖ సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలకు భరోసా కల్పిస్తూ, వివక్ష లేకుండా న్యాయబద్ధమైన సేవలను అందించాలన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా భావంతో పనిచేస్తూ వనపర్తి జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు మహోన్నత సేవా పతకాలు, సేవా పతకాలు అందుకున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్., ఏ ఆర్ అదనపు ఎస్పీ, వీరా రెడ్డి వనపర్తి డిఎస్పీ,గిరిబాబు, డిసిఆర్బి డీఎస్పీ,బాలాజీ నాయక్ , జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ, సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం , కొత్తకోట సీఐ,రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, సిసిఎస్ సీఐ, అశోక్ , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని పోలీసు అధికారులు సిబ్బంది జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజా చైతన్యానికి మీడియా ముందుండాలి : ఎస్పీ

**ఒక వార్త వందల మందిని సైబర్ మోసాల నుంచి కాపాడుతుంది**
**సైబర్ నేరాల నివారణలో మీడియా భాగస్వామ్యం కీలకం**
**మోసపోయిన వారు 1930కు సకాలంలో ఫిర్యాదు చేస్తే నగదు తిరిగి పొందవచ్చు**
**సైబర్ నేరాల నివారణకు పోలీసు శాఖ-మీడియా సమన్వయంతో ముందుకు సాగాలి**



**(సమయం ప్రతినిధి వనపర్తి) :** సైబర్ నేరాల బారిన పడిన బాధితులకు సత్వర సహాయం అందించేందుకు 1930 హెల్ప్‌లైన్‌ను ప్రజలు వినియోగించుకోవాలని, సైబర్ భద్రతపై ప్రతి ఇంటికీ అవగాహన చేరేలా మీడియా సంస్థలు విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, అన్నారు. మంగళవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, సైబర్ మోసాలు మరియు 1930 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించే అవగాహన కల్పించారు కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా రోజురోజుకు కొత్త రూపాల్లో పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, నకిలీ ఉద్యోగాలు, కస్టమర్ కేర్ పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మభ్యపెట్టడం వంటి ఘటనలు అధికమవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఎవరికీ తెలియజేయరాదని సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఆమె తెలిపారు. సకాలంలో ఫిర్యాదు అందినట్లయితే మోసగాళ్ల ఖాతాలకు వెళ్లిన నగదును సంబంధిత బ్యాంకుల సహకారంతో హోల్డ్‌లో ఉంచి, చట్టపరమైన ప్రక్రియ ద్వారా బాధితులకు తిరిగి అందించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతతో పాటు మీడియా ప్రతినిధుల పాత్ర కూడా ఎంతో కీలకమని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తూ, బాధితులకు అందుబాటులో ఉన్న సేవలను ప్రజలకు చేరవేయడంలో మీడియా సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. సమాజాన్ని సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీసు శాఖ, మీడియా, ప్రజలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రత, ఆన్‌లైన్ మోసాల గుర్తింపు, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై మీడియా ప్రతినిధులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, (పరిపాలన) రాజేష్ మీనా ఐపీఎస్, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు వనపర్తి సీఐ, సుగంధర రత్నం, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్, జిల్లాలోని అన్ని పత్రికల చానల్లో పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల మున్సిపాలిటీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**జడ్చర్ల, సమయం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. గిరీష్, మేనేజర్ లక్ష్మన్న, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, మాజీ చైర్‌పర్సన్‌లు కోనేటి పుష్పలత, దోరేపల్లి లక్ష్మి, మాజీ కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్ రెడ్డి, చైతన్య చౌహాన్, కుమ్మరి రాజు, లత, దేశావలి సతీష్ కుమార్, సుంకసారి రమేష్ తదితర ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**నాగర్ కర్నూల్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు**
**అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించిన**
**ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి**



**(సమయం నాగర్‌కర్నూల్ ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంగళవారం అమరవీరుల స్మారక చిహ్నం వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా అటవీశాఖ అధికారి రేవంత్ చంద్ర,పోలీసు అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జి. చిన్నారెడ్డి ఉదయం 08 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ఏర్పాటు ముందు ఉన్న పరిస్థితులు, రాష్ట్ర అవతరణ అనంతరం విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో సాధించిన పురోగతిని ప్రజలకు వివరించారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణతో అన్ని రంగాల్లో అభివృద్ధి వేగవంతమైందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

సోదరసోదరీ మణులారా !

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజానీకానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమర వీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తున్నాను.తెలంగాణ అవతరించి నేటికి 12 వసంతాలు పూర్తి చేసుకొని మనం కలలుగంటున్న బంగారు తెలంగాణ నిర్మాణం దిశగా బలమైన అడుగులు వేయగలిగాం. తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు ఉండే విధంగా మనం ప్రవేశ పెట్టిన ప్రణాళికలు సత్ఫలితాలనిస్తూ, నిరంతర ప్రగతిశీల రాష్ట్రంగా తెలంగాణ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నది. నేడు తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న విజయాలు తెలంగాణ బిడ్డలుగా మనందరికీ గర్వకారణం. అనతికాలంలోనే రాష్ట్రం అద్భుత విజయాలను సాధించిందని చెప్పడానికి నేనెంతో సంతోషిస్తున్నాను. వివిధ రంగాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అద్భుతమైన ప్రశంసలు అందుతున్నాయి. దేశంలో మరే రాష్ట్రం అమలు చేయని ఎన్నో కార్యక్రమాలకు నాంది పలకడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నది. అనేక రంగాలలో జాతీయస్థాయిలో మన రాష్ట్రం సాధించిన అవార్డులు సమర్థవంతంగా సాగుతున్న పరిపాలనకు గీటురాళ్లు.ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం కంకణం కట్టుకుంది. నేటి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. 2023 డిసెంబర్ 28 నుంచి సరికొత్తగా ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నది. ప్రభుత్వ అధికారులను రాష్ట్రంలోని ప్రతి పల్లెకు, ప్రతి బస్తీకి పంపించి గ్రామ సభలు నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్యక్రమాలలో మన జిల్లా సాధించిన ప్రగతిని ఒక్కొక్కటిగా వివరించారు. మన జిల్లాను అభివృద్ధి పథములో ఉంచడానికిగాను పని చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగానికి, దశ దిశ నిర్దేశిస్తున్న జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులకు, జిల్లా మంత్రివర్యులకు, పార్లమెంట్ సభ్యులకు, శాసన మండలి సభ్యులకు మరియు గౌరవ శాసన సభ్యులకు, అభివృద్ధి కార్యక్రమాలలో పూర్తి సహకారము అందిస్తున్న సమస్త ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు ఎంతో శ్రమించి అన్ని కార్యక్రమాలను జయప్రదం చేస్తున్న జిల్లా కలెక్టర్ గారికి, జిల్లా S.P గారికి మరియు జిల్లా అధికారులకు వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలలో అవగాహన కలిగిస్తూ జిల్లా అభివృద్ధికి పాటు పడుతున్న పత్రికా ప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు జిల్లా ప్రజానీకానికి తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నానన్నారు.

# ప్రగతి బాటలో సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

**పేట జిల్లా ఆవిర్భావ వేడుకల్లో మంత్రి శ్రీహరి పిలుపు**

**(సమయం ప్రతినిధి నారాయణ పేట) :** నారాయణపేట జిల్లాలో తెలంగాణ దినోత్సవం వేడుకల్లో రాష్ట్ర క్రీడ, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక,మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నరు. మంత్రి శ్రీహరి ప్రసంగిస్తూ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశం లోను ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక, సామాజిక,పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటును రూపొందించినట్టు ముఖ్యమంత్రి ఇటీవల జరిగిన నీతి అయోగ్ సమావేశంలో వెల్లడించారు.

**తెలంగాణ రైజింగ్ 2047 కీలక అంశాలు**

పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి ఇన్రా్ఫ డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్రా్ఫ అండ్ ఇండస్ట్రియల్ పాలసీ, టూరిజం పాలసీలను ప్రభుత్వం సిద్ధం చేసింది.

**ఆడబిడ్డలకు అండదండలు**

ఆడబిడ్డలు ఆనందంగా ఉన్న ఇంట మహాలక్ష్మి తాండవిస్తుంది. అందుకే రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 500 రూపాయలకే వంటగ్యాస్ సరఫరా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలతో పాటు సంపన్నులతో సమానంగా తెలంగాణ మహిళలతో విద్యుత్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళ సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, శిల్పా రామంలో 100 ఇందిరా మహిళ శక్తి స్టాళ్లను ప్రభుత్వం ప్రారంభించింది. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించాం. ఇందులో 150 బస్సులు ఇప్పటికే అందజేయడం జరిగింది.

**రైతులకు రుణ విముక్తి**

దేశ వ్యవసాయ చరిత్రలో నిలిచిపోయేలా అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిది నెలల కాలంలో 25 లక్షల 35 వేల 964 మంది రైతులను రుణ విముక్తులను చేయడం జరిగింది. 20 వేల 617 కోట్ల రూపాయల రుణమాఫీ చేశాము. రైతు భరోసా కింద ఎకరానికి 12వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నాము. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ చేస్తున్నాము. సన్న ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నాము. గతేడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం పండించి తెలంగాణ రైతులు దేశానికి ఆదర్శంగా నిలిచారు.

**నిరుపేదలకు సన్నబియ్యం :** పేదల ఆకలి తీర్చటం తోపాటు వారు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇందిరమ్మ ఇల్లు,సన్న బియ్యం పథకాలను అమలు చేస్తున్నాం.

**ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం**

సంక్షేమంతో పాటు సామాజిక న్యాయంలో సైతం తెలంగాణ... దేశానికి దిశా నిర్దేశం చేస్తోంది. పారదర్శకంగా కుల గణన నిర్వహించి బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**యువతకు ఉపాధి ఉద్యోగాలు**

ఈ రాష్ట్ర యువత ప్రజా ప్రభుత్వ నిజమైన నిర్మాతలు. వారి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ యువత ఉపాధి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. రాజీవ్ అభయ హస్తం పథకం కింద సివిల్స్ చదివే వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నాము. 25 ఎకరాల సువిషాల విస్తీర్ణంలో 58 యంగ్ ఇండియా





ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం**

రాష్ట్రంలో నిరుపేదలకు నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాము. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం . ఇప్పటికే గృహ నిర్మాణాల ప్రారంభమై నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగింది. గిరిజన ప్రాంతాలలోని చెంచులకు పదివేల గృహాలు కేటాయించాము.

**నారాయణపేట జిల్లా వారీగా చూస్తే...**

రైతు భరోసా పథకం ద్వారా 2025- 26 సంవత్సరానికి గాను సుమారు రెండు లక్షల మంది రైతులకు 421 కోట్ల విలువగల నగదును పంపిణీ చేయడం జరిగింది. 2026 కి గాను వివిధ సంస్థల ద్వారా రైతులకు ఎరువులు అందజేయుటకు సిద్ధంగా ఉంచడం జరిగింది. నారాయణపేట జిల్లాలో మొత్తం 6,526 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 1,151 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి అయి గృహప్రవేశాలు చేయడం జరిగింది. ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో 50 మంది లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ నిధులతో 60 లక్షలతో కరెంటు సదుపాయం, బోర్లు, మొదటి పంటకు సహాయం కల్పించడం జరిగింది. నైపుణ్య క్యాటగిరిలో 35 మంది దళిత మహిళలకు 90 రోజుల టైలరింగ్ శిక్షణ అందించి 7 లక్షల విలువగల కుట్టు యంత్రాలను మంజూరు చేయడం జరిగింది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా నారాయణపేట జిల్లాలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకును నిర్వహించి విజయవంతంగా నడపబడుతున్నది. 2438 సంఘాలకు గాను ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 237 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగింది. మక్తల్,నారాయణపేట,కోస్గి మద్దూర్ మున్సిపాలిటీలలో 58.54 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వన మహోత్సవంలో భాగంగా అటవీ ప్రాంతాలలో,బయట ప్రాంతాలలో 25 లక్షల 82 వేల మొక్కలను నాటడం జరిగింది. మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందించడానికి 4,725 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతిని మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి 20 లక్షల రూపాయల పరిహారం చొప్పున అందజేయడం జరిగింది. జిల్లాలో 92 వేల 975 పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేయడం జరిగింది.పశువులకు అత్యవసర సేవలు అందించుటకై మక్తల్ నారాయణపేట నియోజకవర్గం లకు 2 మొబైల్ అంబులెన్సు సర్వీసులు ఉన్నాయి. మక్తల్ లో 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం మంజూరు చేయడం జరిగింది. జిల్లాలో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు దాదాపు 2 కోట్ల 73 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి దాదాపు 132 కోట్ల రూపాయలు లబ్ది పొందడం జరిగింది. జిల్లాలో 70 వేల 120 మంది లబ్ధిదారులకు 1,83,969 సిలిండర్లను సబ్సిడీ ద్వారా ఇచ్చి 4 కోట్ల 66 లక్షల రూపాయలను ఖాతాలలో జమ చేయడం జరిగింది. నారాయణపేట జిల్లాలో 32 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో మొత్తం పదకొండు 33/11 కెవి విద్యుత్ సబ్స్టేషన్ల నిర్మాణ పనులను చేపట్టడం జరిగింది. ఆయిల్ పంప్ తోటల పెంపకం కోసం 208 ఎకరాలలో 84 మంది రైతులకు లబ్ధి చేకూర్చడం జరిగింది. జిల్లాలో నాబార్డ్ వారి సౌజన్యంతో 22 వేల 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 5 గోదాములు ఏర్పాటు చేయడం జరిగింది. 2025- 26 సంవత్సరానికి గాను పెద్ద సైజు చేప పిల్లలను చెరువులు రిజర్వాయర్లలో వదలడం జరిగింది. మొన్న జరిగిన పదవ తరగతి ఫలితాలలో నారాయణపేట జిల్లా.. 97.82% ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 14వ స్థానం దక్కించుకుంది. ప్రభుత్వ పాఠశాలలో వారానికి మూడుసార్లు రాగిజావ మూడుసార్లు గుడ్లు సరఫరా చేయడం జరుగుతుంది. ఈ ఏడాది జూన్ 12 నుండి పాఠశాలల్లో ఉదయం అల్పాహారం ప్రారంభించడం జరుగుతుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి 100 లీటర్ల చొప్పున పట్టణ ప్రాంతాల్లో 135 లీటర్ల చొప్పున త్రాగునీటిని సరఫరా చేయడం జరుగుతుంది. జిల్లాలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న దాదాపు 30,000 మంది కి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగింది. రబీ సీజన్లో ఈ జిల్లాలో 163 కొనుగోలు కేంద్రాల ద్వారా 17 వేల 460 మంది రైతుల నుంచి 305 కోట్ల విలువైన 1లక్ష 27 వేల 531 టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ ల సంఖ్య గణనీయంగా పెంచడం జరిగింది. ఆరోగ్యశ్రీ 5 లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచడం జరిగింది. నారాయణపేట జిల్లాలో704 అంగన్వాడి కేంద్రాల ద్వారా దాదాపు 13 వేల మంది పిల్లలకు ఒక పూట సంపూర్ణ భోజనం ఇవ్వడం జరుగుతుంది. నేతన్న పొదుపు పథకం ద్వారా 904 మంది చేనేత కార్మికులకు బ్యాంకు ఖాతాలను తెరిపించడం జరిగింది. దురదృష్టవశాత్తు చనిపోయిన నేతన్న కుటుంబానికి ఐదు లక్షల రూపాయలను జమ చేయడం జరుగుతుంది. జిల్లాలోని 13 మండలాలకు15 వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. జిల్లాలోని పలు అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు మంజూరు అయి 517 కోట్లతో పనులు పురోగతిలో ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో బాధిత మహిళలు బాలికల సంరక్షణ అర్థం నూతన భరోసా సెంటర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణకు నూతనంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఎస్పీ కార్యాలయం డిపిఓ భవన నిర్మాణానికి ఏడు ఎకరాలలో 38 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. శాంతి భద్రతల నిర్వహణకు అహర్నిశలు కృషి చేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి అభినందనలు తెలియజేసుకుంటున్నాను. నారాయణపేట జిల్లా సర్వతోముఖాభివృద్ధికై మనమందరం పునరంకితమవుదామని విజ్ఞప్తి చేస్తూ ప్రగతి బాటలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరుకుంటూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.

# నాలుగు ఐదు తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

**(సమయం నాగర్ కర్నూల్ ప్రతినిధి) :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ ,నారాయణపేట, గద్వాల చేపట్టిన కీలక సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లు ఆదేశించారు. పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యటన మార్గం, భద్రతా ఏర్పాట్లు, ప్రజా ప్రతినిధుల సమన్వయం, సాగునీటి ప్రాజెక్టుల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సవివరంగా మంత్రులు అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ......, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. సాగునీటి రంగ అభివృద్ధి ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మితమవుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంత రైతులకు వరంగా మార్పు చెందుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టులను సందర్శించి వాటి పురోగతిని పరిశీలించనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రాజెక్టుల ప్రాధాన్యత, వాటి ద్వారా సాగులోకి వచ్చిన కొత్త ఆయకట్టు, రైతులకు కలిగిన ప్రయోజనాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలను సమగ్రంగా ముఖ్యమంత్రికి అధికారులకు సూచించారు. పర్యటనలో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, రవాణా, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలతో పాటు సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని





మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....... ముఖ్యమంత్రి పర్యటన రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని, జిల్లాల వారీగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అన్ని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రజాప్రతినిధులు మరియు అధికారుల మధ్య సమన్వయం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రాజెక్టుల సందర్శన పనుల పురోగతి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మంత్రులకు ముఖ్యమంత్రి పర్యటన వివరాలు వివరిస్తూ,.... నాగర్ కర్నూలు జిల్లాలో కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని సోమశిల ప్రాంతంలో వీవీఐపీల రాత్రి బస తోపాటు పాలమూరు రంగారెడ్డి నార్లాపూర్ ప్రాజెక్టు సందర్శన, కుమ్మెర, వట్టెం రిజర్వాయర్ల సందర్శనకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి సందర్శించే అన్ని ప్రాంతాలను జిల్లా ఎస్పీతో కలిసి తను స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందని, అక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీతో కలిసి తాను స్వయంగా పర్యటిస్తూ ముఖ్యమంత్రి సందర్శించనున్న అన్ని ప్రాంతాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల కోసం జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు సమావేశాలు నిర్వహిస్తూ, అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని కలెక్టర్ మంత్రులకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్,దేవ సహాయం, ముఖ్యమంత్రి భద్రత అధికారులు శ్రీధర్, ప్రకాష్, పాలమూరు రంగారెడ్డి ఎస్సీ పార్థసారథి, ఇరిగేషన్ అధికారులు మురళి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపద సమానత్వం,
# సామాజిక న్యాయం ప్రజలందరికీ అందాలి







**వనపర్తి. సమయం ప్రతినిధి:** రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ పంపిణీ జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తూ, సకల జనుల సంక్షేమానికి పాటుపడుతున్నదని చీఫ్ విప్, తెలంగాణ శాసనమండలి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళ వారం వనపర్తి జిల్లాలోని ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ వేడుకలకు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణఅమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అంతకుముందు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యఅతిథి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలోఅమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

**ముఖ్య అతిథి ప్రసంగం: ఇలా సాగింది**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇట్టి వేడుకలకు హాజరైన పార్లమెంట్ సభ్యులకు, శాసన మండలి సభ్యులకు, శాసన సభ్యులకు, కలెక్టర్ కి, అదనపు కలెక్టర్లకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులకు, వివిద శాఖల జిల్లా అధికారులకు, విద్యార్థులకు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, పుర ప్రముఖులకు నా హృదయ పూర్వక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామజిక న్యాయం ప్రాతిపదికగా ప్రజలందరికీ పంపిణీ జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తూ, సకలజనుల సంక్షేమానికి పాటుపడుతున్నదన్నారు. ప్రణాళికాబద్ధమైన విధానాలు, ఆర్థిక క్రమ శిక్షణ, అందరి సహకారంతో అన్ని రంగాలలో ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం మార్చి 6 నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టినందున జిల్లాలో ఇప్పటివరకు 9 అంశాలు అనగా పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత అరైవ్ - అలైవ్, సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, నో-డ్రగ్స్ ప్రచారం, రైతు సంక్షేమం, విద్యా, ఉపాధి అవకాశాలు, యువత, క్రీడలకు ప్రోత్సాహం, మహిళా శిశు సంక్షేమం కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల వివరాలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సమావేశాలలో ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. మన రాజ్యాంగంలో పొందుపర్చినట్లు మన తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో 6 గ్యారెంటీలను ప్రకటించడం జరిగింది. ఆ దిశగా ప్రభుత్వం వివిద రకాల సంక్షేమ పథకాలను అమలుపరుస్తుందని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి కి , పార్లమెంట్ సభ్యులకు, శాసన మండలి సభ్యులకు, శాసన సభ్యులకు, ఇతర ప్రజా ప్రతినిధులకు, జిల్లా న్యాయమూర్తులకు, జిల్లా కలెక్టర్ కు , అదనపు కలెక్టర్లకు వివిధ శాఖల జిల్లా అధికారులకు, శాంతిభద్రతల నిర్వహణలో నిరంతరం కృషిచేస్తున్న జిల్లా ఎస్పీ కి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు మరియు ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియచేశారు. అందరికీ మరొక్కసారి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను ముఖ్యఅతిథి సన్మానించారు. అనంతరం ఐ డి ఓ సి ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్ ను సందర్శించి సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల చిన్నారుల ద్వారా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా పర్యావరణ అవగాహన లో ప్రతిభ చాటిన వనపర్తి జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్, కొత్తకోట జడ్పీహెచ్ఎస్ బాలికల, పెబ్బేరు కేజీబీవీ పాఠశాలలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి మున్సిపాలిటీ ఛైర్పర్సన్ మాధవి, జిల్లా అధికారులు, వనపర్తి మార్కెట్ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## "జ్ఞాన చైతన్య బస్సు యాత్ర"ను ప్రారంభించిన ఎంపీ మల్లు రవి



**(సమయం ప్రతినిధి అలంపూర్) :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని జోగులాంబ గద్వాల జిల్లా పవిత్ర పుణ్యక్షేత్రమైన జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మరియు ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన లక్ష్యంగా చేపట్టిన "జ్ఞాన చైతన్య బస్సు యాత్ర"ను నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ , సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సరితమ్మ , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి , మాజీ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గద్వాలలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

(సమయం ప్రతినిధి గద్వాల) : గద్వాల పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసినతెలంగాణ రాష్ట్ర సలహాదారులు ఢిల్లీ అధికార ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ , లిజిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కలిసి స్మృతివనంలో అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీ అధికార ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డికి, శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఎమ్మెల్యే ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ అమరవీరులకు రెండు నిముషాలు మౌనం పాటించారు జరిగినది. అనంతరం గద్వాల జిల్లా పాత బస్టాండ్ నందు కీ.!!శే పాశం సర్వారెడ్డి కొట్టం కీ.!!శే వేణుగోపాల్ విగ్రహాలకు నివాళులర్పించి జరిగింది. ఎమ్మెల్యే ఢిల్లీ అధికార ప్రతినిధి మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## మల్లారెడ్డి సార్ కథ... బుర్రే.. బుర్ర...

హైదరాబాద్ : సంపాదనకు అలవాటు పడ్డ మనిషి ప్రతి దాంట్లో కూడా డబ్బునే చూస్తాడు. పైసా పెట్టుబడి పెడితే ఎంత లాభం వస్తుందో ముందుగానే అంచనా వేస్తాడు.. అటువంటివారు ఎందరో అడుగుపెట్టినా సరే ధనలక్ష్మి పరుగులు తీసుకుంటూ వస్తుంది. ఇటువంటి అదృష్ట జాతకులు కొంతమంది మాత్రమే ఉంటారు. అందులో మన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సార్ మొదటి స్థానంలో ఉంటాడు.పాల వ్యాపారంతో మొదలుపెట్టి.. పూలను అమ్మే స్థాయికి ఎదిగి.. బోర్వెల్ వ్యాపారం స్టార్ట్ చేసి.. ఎన్నో పాఠశాలలు.. కళాశాలలు.. ఇప్పుడు ఏకంగా దేశంలోనే ఏఐ యూనివర్సిటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే మల్లారెడ్డి కథ ఈ కథనంతోనే ముగియదు. ఎన్ని రకాల విమర్శలు ఉన్నా.. మల్లారెడ్డి స్టయిల్ వేరే విధంగా ఉంటుంది. తన పొలిటికల్ లీడర్ కాకముందు ఒక వ్యాపారి. వ్యాపారిగా విజయం సాధించిన తర్వాత.. తన ఆస్తులను కాపాడుకునేందుకు రాజకీయాల్లోకి వచ్చారు. చాలామంది ఆయన సేవ చేయడానికి వచ్చారు అంటారు గాని.. ఒక వ్యాపారి సమాజ సేవ చేయడం ఈ దేశం ఇంతవరకు చూడలేదు. ఇకముందు చూసే అవకాశం లేదు.తాజాగా మల్లారెడ్డి ప్రొఫెసర్ అవతారం ఎత్తారు.. ఏఐ పాఠాలు చెప్పడం మొదలుపెట్టారు. అందులో ఏం నేర్చుకోవాలి.. ఎలా నేర్చుకోవాలి.. అనుభవాన్ని ఎలా ఉపయోగించుకోవాలి.. ఈ కాలానికి మనల్ని మనం ఎలా మార్చుకోవాలి అనే అంశాల మీద పాఠాలు చెప్పారు. జీవిత సారాన్ని అవపోసన పట్టిన వ్యక్తిగా మల్లారెడ్డి వాస్తవాలను చెప్పుకుంటూ పోయారు.. చాలామంది ఆయన మాటలకు కనెక్ట్ అయ్యారు.. అయితే చివర్లో మల్లారెడ్డి ఒక ట్విస్ట్ ఇచ్చారు. ఇంత చెప్పిన తర్వాత ఏఐ ఎందుకు ఎంచుకోవాలి.. ఏ ఐ ద్వారా ఏం జరుగుతోంది.. భవిష్యత్తులో వచ్చే మార్పుల గురించి స్పష్టంగా చెప్పారు. ఆయన ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు కాబట్టి తనకు తానే ఒక బ్రాండ్ గా మారిపోయి ప్రచారం చేసుకుంటున్నారు.గతంలో ఉత్తర ప్రదేశ్ లో యూనివర్సిటీ పెడుతున్నట్టు మల్లారెడ్డి ప్రకటించారు. దానికంటే ముందు హైదరాబాదులో యూనివర్సిటీని ప్రారంభిస్తున్నారు.







# తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహణ





మొదటి పేజీ తరువాయి

**మహబూబ్‌నగర్, సమయం ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ-కలెక్టరేట్)లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని మంత్రి తన ప్రసంగంలో వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలను ఘనంగా సన్మానించారు. వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎస్పీ డి. జానకి, డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్, మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జె.ఎల్.బి. హరిప్రియ, డీఆర్వో నిర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై స్టాళ్ల సందర్శన**

రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల స్టాళ్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మేయర్ మమత తదితరులు సందర్శించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం ఏర్పాటు చేసిన ప్రజాపాలన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైద్యారోగ్య, వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖలు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వల్లూరు విద్యార్థినులు ప్రథమ బహుమతిగా రూ.25 వేల నగదు బహుమతి అందుకోగా, జవహర్ బాలభవన్ చిన్నారులు ద్వితీయ బహుమతిగా రూ.15 వేలును, నాట్యం అకాడమీ విద్యార్థినులు తృతీయ బహుమతిగా రూ.10 వేలును అందుకున్నారు. యోగా ప్రదర్శనకు రూ.5 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. అదేవిధంగా పాలమూరు, గండీడ్ మండలాల మహిళా సమాఖ్యలకు ఐదు ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం రూ.2.46 కోట్ల విలువైన చెక్కును మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు.









OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085